## క్లుప్తంగా

### వాటర్ ప్లాంట్ వితరణ



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు స్థానికుడు తిప్పర్తి ప్రవీణ్ కుమార్ రూ.45 వేల విలువ చేసే వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. దానిని శుక్రవారం స్థానిక సర్పంచ్ జక్క మల్లుభాయి ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందించటానికి వాటర్ ప్లాంట్ అందించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా దాతను పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు సన్మానించారు. ఎంఈవో రాజేశ్వర్, ఉప సర్పంచ్ జక్క గంగాధర్, హెచ్‌ఎం లక్ష్మీ నారాయణ, ఎస్సెమ్సీ చైర్మన్ పిప్పెర గణేష్ పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు కేజీబీవీ విద్యార్థిని



బాల్కొండ: జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు బాల్కొండ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థిని అపర్ణ ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేకాధికారిణి భవాని తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని శుక్రవారం పాఠశాలలో అభినందించారు. బీహర్‌లో ఈ నెల 10 నుంచి 13 వరకు నిర్వహించే పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని తెలిపారు. పీఈటీ స్రవంతి పాల్గొన్నారు.

### పశువులకు టీకాలు

రుద్రూర్: సిద్దాపూర్‌లో పశువులకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ లక్ష్మణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి సంతోష్ రెడ్డి, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

### ఏసీపీ ఆకస్మిక తనిఖీ

మాక్లూర్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఏసీపీ కిరణ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో నేరాల రేటు ఎలా ఉంది, కేసులు ఏ మేరకు నమోదు చేస్తున్నారు.. మద్యం దుకాణాల వల్ల ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని ఎస్సై యాదగిరిగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలో కొన్ని అక్రమ వ్యాపారాలు కొనసాగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని వాటన్నింటిపై కఠినంగా వ్యవహరించాలని ఎస్సైకి సూచించారు. ప్రధానంగా రహదారులపై రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రతలు చేపట్టాలన్నారు. ఫిర్యాదులతో స్టేషన్‌కు వచ్చిన బాధితుల పట్ల ప్రేమ పూర్వకంగా మాట్లాడాలన్నారు. ఏసీపీ వెంట నార్త్ జోన్ సీఐ నరహరి ఉన్నారు.

### షిర్డీ యాత్రకు బయలుదేరిన భక్తులు

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం నుంచి పలువురు భక్తులు శుక్రవారం షిరిడీకి పాదయాత్రగా బయలుదేరారు. సాయిబాబా ఆలయ నిర్వాహకుడు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఎడపల్లి సాయిబాబా ఆలయం నుంచి షిరిడీకి పాదయాత్రగా బయలు దేరారు. ప్రతి ఏటా సాయిబాబా ఆలయం నుంచి షిరిడీకి భక్తులతో కలిసి పాదయాత్ర చేస్తున్నామని, ఈసారి దాదాపు 40 మంది భక్తులతో పాదయాత్రగా వెళుతున్నట్లు వెంకటేశ్వర శర్మ తెలిపారు.

### బోరు బావి తవ్వకం

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో దుర్గా దేవి ఆలయ ప్రాంగణంలో జెడ్పీటీసీ నిధులతో బోర బావి తవ్వకం చేపట్టారు. ఈ సందర్భంగా తవ్వకం చేపట్టే ముందు జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ , ఎంపీపీ సామ పద్మ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ఎంపీటీసీ పద్మ, ఉప సర్పంచ్ సువర్ణ పాల్గొన్నారు.

### క్రీడా సామగ్రి అందజేత

మాక్లూర్: అమ్రాద్ ప్రభుత్వ పాఠశాలకు క్రీడా సామగ్రిని శుక్రవారం సర్పంచ్ లింగం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పాఠశాలకు క్రీడా సామగ్రి కోసం రూ.5 వేలు అందజేయగా.. ఆ డబ్బులతో క్రీడా సామగ్రిని కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకే ప్రభుత్వం ప్రతి పాఠశాలకు నిధులు ఇస్తుందని ఈ సందర్భంగా సర్పంచ్ అన్నారు. ఉపాధ్యాయులు కూడా క్రీడల పట్ల విద్యార్థులను ఆకర్షితుల్ని చేయాలన్నారు.

### ఎస్సీ రుణాల చెక్కుల పంపిణీ

బోధన్ రూరల్ (బోధన్): మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణాల చెక్కులను శుక్రవారం ఎంపీపీ సావిత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అర్హులైన నిరుపేద దళిత కుటుంబాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రూ. 50 వేలు అందజేస్తుందన్నారు. మండలంలో 9 మంది లబ్ధిదారులకు రూ.4.8లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

# శివమాలలో తరిస్తున్న భక్తులు

- 41 రోజుల పాటు కఠిన దీక్ష
- నిత్యం పూజలు, భజనలు



అభిషేకం నిర్వహిస్తున్న శివమాలధారణ స్వాములు



కొత్తపల్లిలో భజన కీర్తనలు చేస్తున్న స్వాములు

బాల్కొండ: కోటి జన్మలలో ఆర్జించిన పుణ్య ఫలితంగా శివ భక్తి ఉదయిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. అనంత పుణ్యం వల్లే శివ భక్తి కలుగుతుందని ఇతిహాసాలు పేర్కొంటున్నాయి. ఈ కారణంతో గ్రామాల్లో శివ భక్తులు అనేక మంది మాల ధారణ చేపడుతున్నారు. శివ రాత్రి పర్వదినానికి 41 రోజుల ముందు నుంచి కఠోరమైన దీక్షతో శివ పూజలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత సంవత్సరం శివ మాల ధరించడంలో యువత ఎక్కువగా ఆసక్తి కనబరుస్తోంది. ముప్కాల్ మండల కేంద్రంలో పడి లేచిన మాయల మర్రిచెట్టు వద్ద, వేంపల్లిలో శివాలయం వద్ద, కొత్తపల్లిలో రాజరాజేశ్వర ఆలయం వద్ద, వెల్కటూర్‌లో పార్వతి రాజారాజేశ్వర ఆలయం వద్ద భక్తులు అనేక మంది శివ మాలధారణ చేపట్టారు. ఉదయం 4 గంటల నుంచే పూజలు, భజన కీర్తనలతో భక్తులు శివ పూజ నిర్వహిస్తున్నారు.

### ప్రశాంతత లభిస్తుంది



11 ఏళ్లుగా శివ మాలధారణ చేస్తున్నాను. ఆరోగ్య పరంగా ఆనందంగా ఉంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. దేవుడు వరాలు ఇస్తాడని కాదు. మాలో కొంతనైనా మార్పు వస్తుందని ఆశతో మాలధారణ చేస్తున్నాను. – విష్ణు, భక్తుడు

### ఆనందంగా ఉంది



నేను శివ మాల ధరించడం ఇది మూడో సారి. శివ మాల ధరించడం వల్ల మంచి క్రమ శిక్షణ అలవడుతుంది. అంతే కాకుండ మానసిక ప్రశాంతత లభిస్తుంది. శివమాల ధరించడం నా అదష్టంగా భావిస్తున్నాను. – సుందర్‌రావు, భక్తుడు

### మూడోసారి వేసుకున్నాను



శివ మాలను వేసుకోవడం ఇది మూడో సారి. మాల ధరించడంతో ఒక మంచి అలవాటు ఏర్పడుతుంది. ఉదయం లేవగానే తలంటు స్నానం చేసి నిత్యం పూజలు చేసే అలవాటు వచ్చింది. ఇంటి వద్ద రోజూ పూజ నిర్వహించుకుంటాను. – శ్రీనివాస్, భక్తుడు

### క్రమశిక్షణ అలవడుతుంది



శివ మాలను ధరించడం ఆరో సారి. కొత్తపల్లిలో శివాలయం వద్ద సన్నిధిలో 41 రోజులు నియమ నిష్ఠలతో పూజలు నిర్వహిస్తాను. మాల ధరించడం వల్ల మంచి ఆలోచనలతో పాటు అలవాట్లు వచ్చాయి. ఒక రకమైన క్రమ శిక్షణ వస్తుంది. – ప్రవీణ్, భక్తుడు

## నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సామ పద్మ

బాల్కొండ: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామాల్లో అధికారులు చర్యలు చేపట్టాలని ముప్కాల్ మండల ఎంపీపీ సామ పద్మ అన్నారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న వేసవిలో మిషన్ భగీరథ నీటిని పల్లెల్లో సక్రమంగా సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో వీధి కుక్కల, కోతుల బెడదపై సభ్యులు ప్రశ్నించారు. వాటి బెడద తగ్గించటానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశం సాదా సీదాగా కొనసాగింది. జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ, వైస్ ఎంపీపీ ఆకుల చిన్నరాజన్న, కో–ఆప్షన్ సభ్యుడు మునీరొద్దీన్, ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ విక్రమ్, ఎంఈవో రాజేశ్వర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ పథకం అమలు తీరు పరిశీలన



బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

మాక్లూర్: మండలంలో పీఎం కిసాన్ పథకం అమలు తీరును శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు పరిశీలించారు. రైతులకు అందుతున్న సబ్సిడీ, పీఎం కిసాన్ పథకం ద్వారా అందాల్సిన డబ్బుల వివరాలను తెలుసుకున్నారు. పథకం సక్రమంగా అమలు కాకపోతే ఆ ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. ఇండియన్ బ్యాంక్, ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఎన్‌డీసీసీ బ్యాంకులలో పరిశీలన చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పద్మ, వ్యవసాయ విస్తర్ణ అధికారులు రంజిత్ కుమార్, ప్రణతి, రాజు నాయక్‌లు పాల్గొన్నారు.

## స్వయం పరిపాలన దినోత్సవం



విద్యార్థి ఉపాధ్యాయులతో ఉపాధ్యాయులు



వివిధ వృత్తిదారుల వేషధారణలో చిన్నారులు

కమ్మర్‌పల్లి: కోనసముందర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. ఉత్తమ బోధకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

**లిల్లీపుట్‌లో ఘనంగా హెల్పర్స్ డే**

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లిల్లీపుట్ పాఠశాలలో శుక్రవారం హెల్పర్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వృత్తిదారుల వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ లిల్లిపుట్ రామకృష్ణ మాట్లాడుతూ.. నైపుణ్యంతో కూడిన వృత్తులను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు. దేహానికి అవయవాలు ఎంత ముఖ్యమో సమాజ అభివృద్ధికి వృత్తులు అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విలేకరి కుటుంబానికి స్పీకర్ పరామర్శ



పరామర్శిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

రుద్రూర్(కోటగిరి): గుండెపోటుతో మృతి చెందిన కోటగిరి సాక్షి విలేకరి గంగాధర్ కుటుంబ సభ్యులను శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఆరోగ్యంగా, చలాకీగా ఉండే గంగాధర్ ఆకస్మికంగా మృతి చెందడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉస్మానియ వర్సిటీలో (ఎంఏ, ఎల్‌ఎల్‌బీ) అభ్యసించిన గంగాధర్ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాత్రికేయ వృత్తిని స్వీకరించారని బాధిత కుటుంబ సభ్యులు, స్పీకర్‌కు తెలిపారు. ప్రతి రోజు ఉదయం ఇంటి వద్ద ప్రజా దర్బార్ నడిచేదన్నారు. కుటుంబం కన్నా ప్రజల సమస్యలకే అధిక ప్రాధాన్యం ఇచ్చేవారని గంగాధర్ భార్య మాజీ సర్పంచ్ స్వరూప గద్గద స్వరంతో అన్నారు. బాన్సువాడ సెగ్మెంట్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, జెడ్పీటీసీలు శంకర్ పటేల్, నరోజి గంగారాం, నేతలు ఉన్నారు.

### మహిళా ఉద్యమాలను నిర్మిస్తాం

- పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభద్ర



మాక్లూర్: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమాలను నిర్మిస్తామని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభద్ర అన్నారు. శుక్రవారం మాణిక్‌భండార్ చౌరస్తా వద్ద ఆమె మాట్లాడారు. ఇటీవల మహిళలపై అత్యాచారాలు, దాడులు, లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు. జరుగుతున్న దాడులు, వేధింపులపై ఫిర్యాదు చేస్తే పట్టించుకునే నాథులే లేకుండా పోతున్నారన్నారు. వీటన్నింటిని ఇటీవల జరిగిన రాష్ట్ర మహాసభలో చర్చించినట్లు చెప్పారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన ఆదేశం మేరకు బలమైన ఉద్యమాలు చేపడతామన్నారు. నాయకులు సవిత, లక్ష్మీలు పాల్గొన్నారు.

### ఉద్యోగులకు తక్షణమే వేతనాలివ్వండి



బోధన్‌టౌన్(బోధన్) : ప్రభుత్వంలోని వివిధ రంగాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని యూత్ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.వేతనాలు త్వరిత గతిన చెల్లించాలని కోరుతూ బోధన్‌లో నిరసన వ్యక్తం చేశారు. 10వ తారీఖు వచ్చినా ఇప్పటి వరకు ప్రభుత్వం వేతనాలను ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. వేతనాలతో పాటు పెన్షన్ సైతం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధనిక తెలంగాణ రాష్ట్రంలో వేతనాలు, పెన్షన్‌లు చెల్లించడానికి డబ్బులు కరువయ్యాయని మండిపడ్డారు. యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నవీన్‌కుమార్, నేతలు బడు, ఇనాయత్ అలీలు పాల్గొన్నారు.

### నర్సాపూర్ మీదుగా బస్సు నడపాలి



బోధన్‌టౌన్(బోధన్): బోధన్ నుంచి నిజామాబాద్‌కు వెళ్లే బస్సును శక్కర్‌నగర్, నర్సాపూర్ మీదుగా నడపాలని వార్డు కౌన్సిలర్ దూప్‌సింగ్ కోరారు. శుక్రవారం ఆర్టీసీ డిపో మేనేజర్ టీఎస్ స్వామిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడారు. విద్యాభ్యాసం, వ్యాపారం, ఇతర పనుల కోసం అనేక మంది నర్సాపూర్ నుంచి బోధన్ వస్తారని, బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన ఆర్టీసీ డీఎం నర్సాపూర్, శక్కర్‌నగర్ రోడ్డును పరిశీలించారు.

### కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 54వ రోజుకు చేరాయి. దీక్షల్లో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.గంగారెడ్డి, పలువురు న్యాయవాదులు కూర్చున్నారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు విషయంలో అధికార పక్ష ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని న్యాయవాదులు పేర్కొన్నారు. న్యాయవాదులు సీహెచ్‌వీ హన్మంత్‌రావు, పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## బాలా త్రిపుర సుందరీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన

ఎడపల్లి(బోధన్): మంగళ్‌పాడ్‌లో శుక్రవారం బాలా త్రిపుర సుందరీ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఇదివరకు ఉన్న ఆలయ స్థానంలో నూతన ఆలయాన్ని పునర్నిర్మించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. నందిపేట మండలం పలుగుట్ట మంగిరాములు మహారాజ్, చిలుకూరు శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ ఆత్మారాం తదితర వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. హైందవ సంస్కృతి సాంప్రదాయాల గురించి వారు భక్తులకు వివరించారు. అన్నదానం చేశారు. పెద్దలు బిల్లా రామ్మోహన్, సర్పంచ్ హనుమాన్లు, ఎంపీటీసీ వనజ పాల్గొన్నారు.

**మోస్రాలో మరగమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన**

రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ మరగమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, మండల రైతు సమితి కన్వీనర్ పిట్ల శ్రీరాములు పాల్గొన్నారు.

## కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి



మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



అమీనాపూర్ మీటింగ్‌లో పాల్గొన్న బీజేపీ నేతలు

నవీపేట: రాష్ట్రంలో కొనసాగుతున్న కుటుంబ పాలనకు స్వస్తి పలకాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పిలుపునిచ్చారు. ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మోకన్‌పల్లిలో శుక్రవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ కుటుంబ పాలనలో అవినీతి అంతులేకుండా పెరిగిపోతుందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనపై విసుగుచెందిన ప్రజలు బీజేపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలుగా చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు.

**చేసిన అభివృద్ధిని చూపించాలి: మోహన్ రెడ్డి**

బోధన్ నియోజవర్గంలోని అన్ని గ్రామాలలో సమస్యలున్నాయని, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని బోధన్ నియోజకవర్గ నాయకులు వడ్డీ మోహన్‌రెడ్డి విమర్శించారు. నియోజకవర్గంలోని ఏ గ్రామంలోనైనా సమీక్షకు సిద్ధమని, దమ్ముంటే అభివృద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింహారెడ్డి, అడ్లూర్ శ్రీనివాస్, శ్రీధర్, నాగేశ్వర్‌రావ్, రచ్చ సుదర్శన్, ఆనంద్, సుధాకర్, నరిన్, పల్లన్న, రాజేందర్‌గౌడ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

**అమీనాపూర్‌లో 'ప్రజా గోస'**

వేల్పూర్: అమీనాపూర్‌లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా గోస– బీజేపీ భరోసా శక్తి కేంద్ర బూత్‌స్థాయి కార్నర్ సమావేశం నిర్వహించారు. బాల్కొండ బీజేపీ నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్, ఫసల్ బీమా ఆవాస్ యోజన పథకాలను తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బీజేపీ నాయకులు జీవీ నర్సింహారెడ్డి, మల్కన్నగారి మోహన్‌రెడ్డి, ఏలేటి రమేశ్, సాగర్, రవి, నర్సాగౌడ్, ప్రభాకర్, మహేశ్, హరీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

### బకాయిలు చెల్లించి ఆదుకోవాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

బోధన్: ఎన్డీఎస్ఎల్ బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని, అక్ర మ లేఆఫ్ ఎత్తివేసి ఫ్యాక్టరీని తెరిపించాలని కోరు తూ శనివారం అసెంబ్లీ వద్దకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, ప్రతిపక్ష రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులను కలిసి వినతులు అందజేస్తామని ఎన్‌డీఎస్ఎల్ కార్మిక సంఘాల ప్రతినిధులు చెప్పారు. శుక్రవారం షుగర్ ఫ్యాక్టరీ గేట్ ఎదుట కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. 2015 డిసెంబర్ 23న ఎన్‌డీఎస్ఎల్ ప్రైవేట్ యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి బోధన్, ముత్యంపేట(జగిత్యాల), ముంబోజీపల్లి(మెదక్) ఫ్యాక్టరీలను మూసివేసిన విష యం తెలిసిందే. లేఆఫ్ ప్రకటించిన నాటి నుంచి ఇ ప్పటి వరకు ఎనిమిదేళ్లు పూర్తయినా కార్మికుల బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో బతుకులు దుర్భరంగా మారాయని పేర్కొన్నా రు. ఆర్థిక ఇబ్బందుల వల్ల మానసిక ఒత్తిళ్ల, అనారోగ్యంతో 40 మంది కార్మికులు ఒక్కొక్కరుగా మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 80 మంది పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ప్రాణాలతో మిగిలిన కార్మికులకు అయినా బకాయివేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

### స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలి

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణ శివారు ఆచన్‌పల్లి బైపాస్ వద్ద స్వాగత తోరణం ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రామకృష్ణ కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఆచన్‌పల్లి బైపాస్ వద్ద, రుద్రూర్ రోడ్డు తాము పెద్దిరెడ్డి రైస్‌మిల్ వద్ద, నాగన్‌పల్లి రోడ్డు వద్ద స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అంబేడ్కర్ చౌరస్తా, శక్కర్‌నగర్ చౌరస్తాల వద్ద గ్రీనరీ ఏర్పాటు చేయాలని, పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పోల్స్‌కు గతంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ సిరీస్ బల్బులు ఏర్పాటు చేయాలని, డివైడర్‌ల మధ్యలో నాటిన మొక్కల మొదళ్ల భాగంలో వాటర్ కలర్స్ వేసి అందంగా తీర్చిదిద్దాలని కోరారు.

### పోడు భూములపై సమీక్ష



సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

ఆర్మూర్‌టౌన్: ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం పోడు భూములపై ఎఫ్ఆర్‌వో భవానిశంకర్, పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇతరం అధికారులతో ఆర్డీవో శ్రీనివాసులు సమీక్ష నిర్వహించారు. పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం ఆర్మూర్ డివిజన్ పరిధిలో మొత్తం 3175 దరఖాస్తులు రాగా వాటి క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు.

## ఆధ్యాత్మికం..

### వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



మాక్లూర్: అడవి మామిడిపల్లి శివారు గుత్ప చౌరస్తా వద్ద గల అపురూప వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవానికి ముందు అడవి మామిడిపల్లి సర్పంచ్ చింత మల్లారెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆనవాయితీగా కల్యాణోత్సవానికి డప్పు వాయి ద్యాలతో వచ్చి పట్టువస్త్రాలు అందించారు. ప్రధాన అర్చకుడు కుమార స్వామితో పాటు పదుల సంఖ్యలో వేద బ్రహ్మణులు పాల్గొని కల్యాణాన్ని జరిపించగా ఆలయ చైర్మన్ అమృతలత, కమిటీ సభ్యులు నరేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ప్రభ, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా ఆలయ వార్షికోత్సవం**



నవీపేట: మండల కేంద్రంలోని ధర్యాపూర్ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని దేవతామూర్తులకు జలాభిషేకం, కుంకుమార్చన, నూతన వస్త్రాలంకరణ, కల్యాణోత్సవాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

**ఆధ్యాత్మిక చింతన అవసరం**



నవీపేట: మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక దైవ చింతన ఆవశ్యమని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావ్ సూచించారు. యంచ గ్రామంలోని కేదారీశ్వరాలయంలో శుక్రవారం జరిగిన స్పటిక లింగ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలకు ఆయన హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పురాతన ఆలయాల విశిష్టతను భావితరాలకు వివరించాలని సూచించారు. ఆలయాల సందర్శనకు ప్రత్యేక సమయం కేటాయించాలని సూచించారు. సర్పంచుల ఫోరమ్ జిల్లా అధ్యక్షులు ఆసోల్ల శ్రీనివాస్, యంచ సర్పంచ్ లహరి పాల్గొన్నారు.

## సమాచారం..

**నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా పలు ప్రారంభోత్సవాలు**

బోధన్: స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ చేతుల మీదుగా శనివారం పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని బీఆర్‌ఎస్ మండల నాయకులు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. 10.30 గంటలకు ఏకచక్రేశ్వరాలయం ఆలయ అభివృద్ధి నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో పాల్గొననున్నారు. 11.30 గంటలకు కొత్తగా ఏర్పడిన సాలూర మండల రెవెన్యూ పాలనను ఎమ్మెల్యే ప్రారంభించేందుకు విచ్చేస్తున్నారు.